**కామెడీ కథ**

# సుబ్బారావూ-బంపర్ బహుమతులూ

**సుబ్బారావు పాపం మధ్యతరగతి మామూలు మనిషి. పదిహేనేళ్ళబట్టి ఓ గవర్నమెంటు ఉద్యోగం వెలగబెడుతున్నా దబ్బులేవీ వెనకెయ్యలేదు. అతడి కోరికలన్నీ ఎదుగూబొదుగూ లేని ఉద్యోగంతో అణగారిపోతున్నాయి.**

అందుకే 'కొనండి... బంపర్ బహుమతులు గెల్చుకోండి' వంటి ప్రకటనలు పేపర్లో చూసినప్పుడుకాని, టీవీలో చూపించినప్పుడుగాని అదేదో సినిమాలో 'దేవుడి ఫోటో చూసి బ్రహ్మానందం రెచ్చిపోయినట్లుగా, ఆవేశాన్ని కోల్పోతూ వుంటాడు. జేబులు ఖాళీచేసి, తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వుంటాడు సుబ్బారావు.

నెల మొత్తంలో ఫస్టు తారీఖున మాత్రమే సుబ్బారావు సంతోషంగా ఆశలపల్లకిలో ఊరేగుతూ వుంటాడు.

ఎందుకంటే- ఆరోజు నెలకి సరిపడా సరుకులకోసం పిల్లలతో సరదాగా సూపర్ మార్కెట్‌కి వెళ్ళి సంతోషంగా గడుపుతాడు. ఆ సంతోషం కరిగిపోయే నీటిబుడగవంటిదని తనకి తెలుసు. అయినా, ఆశ మానవుడి జీవితనౌకను నడిపించే చుక్కాని వంటిదన్న నగ్నసత్యం సుబ్బారావుకి తెలిసినట్లుగా మరెవరికీ తెలియదేమో.

ఫస్టు తారీఖులెన్నో వస్తూనే వున్నాయి. కానీ సుబ్బారావు సగటు జీవితంలో మార్పేమీ రాలేదు. అలా అని సుబ్బారావు నిరుత్సాహపడడు. చర్వితచరణంలాగా తన కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే వున్నాడు. అదృష్టాన్ని పరీక్షపెడుతూనే వున్నాడు.

మళ్ళీ ఫస్టు వచ్చింది.

సుబ్బారావులో మామూలుగానే లేని ఉత్సాహం, ఎక్కడలేని బలం మేమున్నాము భయం లేదు మిత్రమా ముందుకు సాగిపో అంటూ ప్రత్యక్షమయ్యేయి.

ఆఫీసు నుండి తొందరగ వచ్చేసి, కావలసిన సరుకుల లిస్టు తయారుచేసుకుని, పిల్లల్ని కూడా హుషారెత్తించి, ఎట్లాగైతేనేం సూపర్ మార్కెట్‌కి బయలుదేరేడు.

'బంపరు బహుమతులు గెల్చుకోండి! మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి' వంటి ఆఫర్స్ కోసం సుబ్బారావు రెండు కళ్ళూ వెదుకుతున్నాయి.

''ఒక 'బామ్' సబ్బు కొనండి! మారుతీ గెలవండి! అంతేకాదు కలర్ టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషీన్, మ్యూజికల్ సిస్టమ్... ఎన్నో... ఇంకా ఎన్నెన్నో బహుమతులు''

పబ్లిసిటీ డిస్ప్లే మీద పడింది సుబ్బారావు కన్ను. అంతే, హుషారుగా ఆరు 'బామ్' సబ్బులు ట్రాలీ బాస్కెట్‌లో పడేసేడు ఏదో ఒక బహుమతి గ్యారంటీగా వుంటుందన్న ఆశతో.

తరువాత టాయ్‌లెట్ సోప్స్ దగ్గరికి వెళ్ళేడు. 'గోల్డ్‌కేర్' సబ్బుల మీద పడింది సుబ్బారావు దృష్టి.

జేబులోంచి కళ్ళజోడు తీసి మరీ చదివేడు. 'ప్రతి ఐదు వందల సబ్బులలో ఒక బంగారు నాణెం! మీరు తప్పక గెల్చుకునే అవకాశం!'

ఇంకేముంది బుట్టలో పడిపోయేడు మన సుబ్బారావు.

ఆరు 'గోల్డ్‌కేర్' సబ్బులు బాస్కెట్‌లో పడేసేడు.

సుబ్బారావు ఈ పిచ్చిని తన పిల్లలు గౌతమ్, జానకిలకు కూడా నేర్పేసేడు. వారి లేత వయసు మనసుల్ని కూడా కాలుష్యం చేసేసాడు. అందుకే గౌతమ్ ఆయాసపడుతూ ''డాడీ! ఈ టూత్‌పేస్ట్ కొందాం. లోపల ఏదో ఒక బహుమతి గ్యారంటీగా వుంటుందిట. కొందాం డాడీ'' సుబ్బారావు చొక్కా పట్టుకుని తెగ లాగేస్తున్నాడు పుత్రరత్నం.

పాపం సుబ్బారావు ఆ పేస్టునే కొనక తప్పలేదు. లోపల బహుమతి వుంటుందో లేదో కంపెనీ వాడికే తెలియాలికాని, ఆ వంకపెట్టి, రేటు మాత్రం డబుల్ చేసేసాడు. ఇలా రకరకాల సబ్బులు, గిన్నెలు తోముకునే సబ్బులు, బట్టల సబ్బులు, టూత్‌పేస్టులు కొని, మిగిలినవన్నీ 'రెండు కొంటే ఒకటి ఫ్రీ', 'ఒకటి కొంటే రెండు ఫ్రీ' వంటి ఉచిత కానుకలున్న ఫాన్సీ సరుకులతో బాస్కెట్ నింపేసి, ఎప్పుడెప్పుడు ఇంటికి వెడతామా, ఎప్పుడు రేపర్లన్నీ విప్పేసి తన అదృష్టాన్ని పరీక్షించుకుందామా అనుకుంటూ, పిల్లలతో ఇంటిదారి పట్టేడు.

ఎలాగో రిక్షావాడికిచ్చే చిల్లరనోట్లు మిగిల్చుకుని, ఖాళీ పర్సుతో ఊహాలోకాల్లో విహరిస్తూ ఇంటికి చేరుకున్నాడు.

''డాడీ! మనిల్లొచ్చేసింది'' మాటలతో ఉలిక్కిపడి రిక్షా దిగేడు సుబ్బారావు. వీళ్ళ హడావిడి చూసి, సుబ్బారావు భార్యారత్నం రాధ వీళ్ళకీసారి ఏదో బహుమతి తగిలేసిందనే అనుకుని, వంటింట్లోకి పరుగెత్తి, ఫ్రిజ్‌లోని చల్లటి మంచినీళ్ల గ్లాసులో పోసి, కూల్‌వాటర్ గ్లాసుతో భర్తని సాదరంగా ఆహ్వానించింది.

''ఏరా! ఎందుకంత హుషారుగా వున్నారు? మనకేదైనా...'' నీళ్ళు నములుతూ అడిగింది ఆతృత ఆపుకోలేక.

రాధకి కూడా ప్రతి నెల మొదటిరోజు ఇలా ఆశనిరాశల మధ్య ఊగిసలాట మామూలైపోయింది.

''రాధా! అంత కంగారు దేనికి? ముందు ఒక స్ట్రాంగ్ టీ కొట్టించు'' ఆర్డరు వేసేడు భార్యామణి మీద. రాధ కూడా సస్పెన్సుని భరించలేక, హడావిడిగా టీ తయారుచేసి కప్పును భర్తకి అందించింది ఆప్యాయంగా. సుబ్బారావు రిలాక్సింగ్‌గా టీని త్రాగి, తదుపరి కార్యక్రమానికి ఉద్యమించేడు.

ముందుగా సంచీలోంచి 'బామ్' సబ్బులు తీసేడు. తన ఇంట్లో కొద్దో గొప్పో 'లక్కీ హ్యాండ్స్'గా భావిస్తున్న కూతురు జానకిని ఏదో పెద్ద లక్కీ డ్రా తీయడానికి సినిమా నటిని ఆహ్వానించే రీతిలో సగౌరవంగా ఆహ్వానించేడు. పిల్లలిద్దరూ డాడీ తమలో ముందు ఎవరిని పిలుస్తారా అని ఆదుర్దాగా ఎదురుచూస్తున్న సస్పెన్సుకి తెరదించేడు సుబ్బారావు.

''ఎప్పుడూ తనేనా?'' మూతి ముడుచుకున్నాడు గౌతమ్.

''ఔన్రా! మరి నీది ఐరన్ హ్యాండ్!'' నవ్వుతూ అన్నాడు సుబ్బారావు.

''ఎవరిది ఐరన్ హ్యాండో చూద్దాంలే!'' గొణిగేడు గౌతమ్.

''జానకీ! ఈ పేపర్ జాగ్రత్తగా విప్పి నీ (మన) అదృష్టం పరీక్షించు'' అన్నాడు.

ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న జానకి గబగబా రేపర్ విప్పేసింది.


లోపల 'కంగ్రాచ్యులేషన్స్' అన్న అక్షరాలు చదివి- ''డాడీ! కంగ్రాచ్యులేషన్స్ అని వుంది. మనకి ఏదో బహుమతి వచ్చింది'' అని ఎగిరి

గంతేసింది.

''ఉండవే! నన్ను చదవనీ'' అంటూ జానకి చేతిలోంచి రేపర్ లాక్కుని జేబులోంచి భూతద్దాల కళ్ళజోడు తీసి నెమ్మదిగా చదవనారంభించేడు. రాధ, గౌతమ్ కూడా సుబ్బారావు చుట్టూ చేరేరు.

''కంగ్రాచ్యులేషన్స్. మీరు డిస్కౌంటు కూపన్ గెలుచుకున్నారు. మీరు తరువాత కొనబోయే మా సబ్బుమీద ఇరవై ఐదు పైసలు తగ్గింపు!''. ''ఓహో! ఏం బహుమతి? వీడి బహుమతి తగలబెట్ట. అంటే వీడిచ్చే ఇరవై ఐదు పైసల కోసం మళ్ళీ వీడి సబ్బే కొంటామని వెధవ తెలివి! లక్షలకి లక్షలు లాభం ఆర్జిస్తూ మనకి పావలా పడేస్తున్నాడు'' సుబ్బారావు కోపం కట్టలు తెంచుకుంది.

''సరేలెండి! వాణ్ణి తిట్టుకుని లాభమేమిటి? మన రాతలిలా




వుంటే'' నసిగింది రాధ.

''నేను చెప్పేనా, అక్కడి లక్కీ హ్యాండ్ అన్నారు కదా! ఇప్పుడేనా తెలిసిందా?'' వెక్కిరించేడు గౌతమ్.

''నీది మహాలక్ష్మి అయినట్టు. అయితే, ఈ సబ్బు రేపర్ నువ్వు విప్పి నీది లక్కీ హ్యాండో కాదో రుజువుచెయ్యరా'' సగం డీలా పడిపోతూ గౌతమ్‌ని పిలిచేడు సుబ్బారావు.

గౌతమ్ హుషారుగా ఇంకో బామ్ సబ్బు అందుకుని కళ్ళు మూసుకుని దేవుడికి దండం పెట్టి మరీ విప్పేడు. ''మీకు ప్రయిజు రాలేదు! కానీ డోంట్ వర్రీ. బి హేపీ! మీరు బి.ఎ.ఎమ్ అక్షరాలు కలెక్టు చేసి మా బామ్ సబ్బు ఒకటి ఉచితంగా పొందండి''-

''ఆహా! ఏమి మాస్టర్ ప్లాన్! అందుకే వాళ్ళు కోట్లకి పడగలెత్తుతుంటే మనం ఇలా ఏడుస్తున్నాం?''

నసిగింది రాధ.

''పోనీలే, ఈ రేపర్‌లో 'ఎ' అక్షరం వుంది. మిగిలిన సబ్బులలో కనీసం 'బి', 'ఎమ్' అక్షరాలుంటే ఒక సబ్బయినా వస్తుంది'' ఏడవలేక నవ్వుతూ భార్యామణికేసి చూసేడు పాపం సుబ్బారావు.

ఇక మిగిలిన అదృష్టాన్ని పరీక్షించుకోడానికి మిగిలింది తను, రాధ. వాళ్ళ అదృష్టాలు తెలుస్తూనే వున్నా, ఇంకా ఎక్కడో సుబ్బారావు మస్తిష్కంలో ఆశ మిణుకుమిణుకుమంటూనే వుంది.

''రాధా! నువ్వు ఒక సబ్బు తీసుకో'' అన్నాడు సుబ్బారావు.

రాధ కూడా మొన్న వాళ్ళ కాలనీలో పెట్టిన లక్కీ డ్రాలో చిన్న బహుమతి రావడంతో ప్రస్తుతం తన జాతకం వెలిగిపోతున్నట్లుగా భావించి, రేపర్ విప్పనారంభించింది.

మళ్ళీ మామూలే. 'మీకు బహుమతి రాలేదు. అయినా డోంట్ వర్రీ. బి హేపీ! మీరు బి.ఎ.ఎమ్ అక్షరాలు కలక్ట్ చేసి ఒక బామ్ సబ్బు ఉచితంగా పొందండి' రాధ మొహం బిక్కచచ్చిపోయింది.

పాపం ఏం చేస్తుంది? అయినా, ఇందాకా 'ఏ' వచ్చింది కదా ఇప్పుడు కనీసం బి, ఎమ్ అక్షరాలు వస్తే సబ్బులైనా వస్తాయేమోనని ఆశగా చూసింది.

ప్చ్! మళ్ళీ 'ఎ' అక్షరమే!

''ఛీ! వెధవ సబ్బులు, వెధవ ప్రైజులు. మనల్ని పిచ్చివాళ్ళని చేస్తున్నారు!'' విసుక్కుంటూ వంట కార్యక్రమానికి వంటింట్లోకి దారి తీసింది రాధ.

చివరగా-


బులుసు రాధాకృష్ణమూర్తి

తన జాతకం పరీక్షింపదలచుకున్నాడు సుబ్బారావు. తన ఇష్టదేవతలందరికీ దండం పెట్టుకున్నాడు. రేపర్ విప్పేడు టెన్షన్‌తో. మళ్ళీ అవే వాక్యాలు సుబ్బారావుని వెక్కిరించేయి.

మళ్ళీ 'ఎ' అక్షరమే! అంటే, కనీసం ఒక సబ్బు ఉచితంగా పొందాలన్నా ఎంతో అదృష్టవంతులై వుండాలన్నమాట! కంపెనీవాళ్ళు ఎదురైతే వాళ్ణి షూట్ చేసేద్దామన్నంత కోపం వచ్చింది అతడికి.

సరే! బామ్ సబ్బుల కథ ముగిసింది. మూడు రేపర్లు ('ఎ' అక్షరాలే వున్నవి) నలిపి పారేసేడు కసిగా సుబ్బారావు రాధ ఎంత వద్దంటున్నా వినిపించుకోకుండా.

''రాధా! అప్పుడే డీలా పడిపోకు. మీ సుపుత్రుడు గౌతం కొన్న టూత్‌పేస్టు ఇంకా విప్పలేదు. ప్రతి పాకెట్‌లో ఒక బహుమతి తెలుసా?''




## తెలుగులో ప్రియాంకా చోప్రా

**ప్రియాంకా చోప్రాని తెలుగులో నటింపచేయాలని ఎంతోమంది నిర్మాతలు ప్రయత్నించినా ఎవరికీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వని ఆమె నెక్కంటి శ్రీదేవి ఏం మంత్రం వేసిందోగానీ ఆమె నిర్మించే 'అపురూపం' అనే సినిమాలో నటించేందుకు ఒప్పుకుంది. మంచి బేనర్, కథలో కొత్తదనం, డైరెక్టర్- ఈ మూడు నచ్చితే తెలుగులో నటిస్తానని 'చిలకపలుకులు పలుకుతోంది ఈ అందాలరాశి.**

-మానస



నవ్వుతూ అన్నాడు సుబ్బారావు.

''ఆ బహుమతి ఏదో మీరే తీసుకోండి'' మూతి తిప్పుకుంటూ తన పనిలో నిమగ్నమైంది రాధ.

''ఒరే గౌతమ్! అదేదో నీ చేతితోనే విప్పురా. ఇది నీ అదృష్టానికి ఆఖరి పరీక్ష!'' వాల్ విసిరేడు సుబ్బారావు.

గౌతమ్‌లో కూడా ఆశ చచ్చిపోయింది. అయినా డాడీ ముఖం చూసి, జాలేసి నిర్లిప్తంగా ప్యాక్ విప్పేడు గౌతమ్.

''కంగ్రాట్స్!'' మళ్ళీ ఆశ.

వంటింట్లోంచి రాధ ఒక్క ఉదుటున హాలులోకొచ్చింది.

మారుతీ కారో ఏదో గ్యారంటీగా తగిలుంటుందని...

''ఏమిట్రా! తొందరగా చదువు'' అందరూ గౌతమ్‌ని కంగారు పెట్టేరు. ''చదవడం రాదా?'' అసహనంగా అరిచేడు సుబ్బారావు.

''కంగ్రాట్స్! మీరు ఈ కూపన్ నింపి మా క్రింది చిరునామాకి పంపితే (తగినన్ని స్టాంపులు జతపరచడం మరిచిపోకండి) 'దంత ధావనంలో మెళకువలు' అనే పుస్తకం మీకు ఉచితంగా పంపిస్తాము''

''ఆహా! ఏమి బహుమతి. ఛీ... ఇలాంటి చీప్ ప్రకటనలకి మనం బుట్టలో పడిపోకూడదు. లేవండి! మీ పనులు చూసుకోండి. రాధా! తొందరగా వంటకానీ. నీరసం వచ్చేసింది ఈ బహుమతి ప్రహసనంతో'' షర్టు బటన్స్ విప్పుకుంటూ అన్నాడు సుబ్బారావు.

''డాడీ! ఇంకా అవలేదు. మీరు మనం కొన్న 'గోల్డ్‌కేర్' సబ్బుల విషయం మరచిపోయేరా?'' గుర్తుచేసింది జానకి.

ప్రతి వెయ్యి 'గోల్డ్‌కేర్' సబ్బులలో ఒక బంగారు నాణెం వుండే అవకాశం విశదీకరించింది జానకి.

''అవును జానకీ! మరచేపోయేను. సబ్బులో గోల్డ్‌కాయిన్ వుందో లేదో తెలియాలంటే ఒక్కొక్కరు ఒక్కొక్క సబ్బుతో సబ్బు అరిగేలా స్నానం చేయండి. తొందరగా తెలిసిపోతుంది'' ఉచిత సలహా పారేసేడు సుబ్బారావు.

''ఈ సబ్బు నాది'' జానకి చేతిలోంచి ఒక 'గోల్డ్‌కేర్' సబ్బు లాక్కుని స్నానం చేయడానికి బాత్‌రూమ్‌కి దారితీసేడు గౌతమ్.

సబ్బులు నాలుగూ అయిపోయి, మళ్ళీ ఫస్టు తారీఖు వచ్చేసింది. ఎవరి సబ్బులలోను గోల్డ్‌కాయిన్ మాత్రం రాలేదు.

సుబ్బారావు కుటుంబసభ్యులెవరికీ అదృష్టం వరించలేదు. వారి ఆశా సౌధాలు కూలిపోయేయి.

సుబ్బారావులాంటి మధ్యతరగతి ప్రజల జీవితాలతో దోబూచులాడుతున్న కంపెనీలు మాత్రం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందుతున్నాయి.